సాక్షి ఒడిశా

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,07,249లు, బంగారం 1 గ్రాము 750 మిల్లీగ్రాములు, వెండి 20 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



హర్ ఘర్ తిరంగా ర్యాలీ

పర్లాకిమిడిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

- IIలో▸

సేవాయత్‌కు గాయాలు

భువనేశ్వర్: పూరీలోని శ్రీ జగన్నాథ ఆలయంలో మహాప్రసాదాన్ని మోసుకెళ్లే భోజియా (మోపరి) సేవకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ విచారకర సంఘటన గురువారం చోటు చేసుకుంది. శ్రీ మందిరం ప్రాంగణంలోని ఆనంద్ బజార్‌కు తన తలపై మహా ప్రసాదాన్ని మోసుకుని వెళ్తుండగా ప్రమాదవశాత్తు వేడి పప్పు పడటంతో తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి.

న్యూస్‌రీల్

గోడ మీద రాతలకు ఆధారాలు లభించాయి: ఎస్పీ



పినాక్ మిశ్రా

భువనేశ్వర్: పూరీ శ్రీమందిర్ ప్రాకార మార్గంలో దక్షిణం వైపు బుడి మా ఆలయం రాతి గోడపైన బెదిరింపు సందేశానికి సంబంధించి కొన్ని ఆధారాలు లభించాయి. సీసీటీవీ రికార్డింగు ఆధారంగా ఉగ్రవాద దాడి బెదిరింపు రాతల వెనక ఉన్న వర్గాల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు సాగుతోందని పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా తెలిపారు. దీని కోసం ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ ప్రాంతంలో తిరుగాడుతున్న వ్యక్తి గోడ మీద ఏదో రాస్తున్నట్లు కనిపించినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. సీసీటీవీలో అతని గుర్తింపు స్పష్టంగా కనిపించడం లేదు. ప్రత్యేక బృందం అతని కోసం వెతుకుతోంది. అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించిన తర్వాత పూర్తి వివరాలు స్పష్టం అవుతాయని ఎస్పీ తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జయపురం: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోట్‌పాడ్ ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర అన్నారు. కోట్‌పాడ్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం, మత్తు పదార్థాలు సమాజానికి పట్టిన చీడపురుగులని ఆవేదన వ్యక్తం చేశారు. వీటివలన కుటుంబాలు, జీవితాలు నాశనమవుతున్నాయని పేర్కొన్నారు. నిషా విముక్త సమాజానికి విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాణిరో సాగర్, ఉపాధ్యాయులు సుజిత్ సర్కార్, రౌతి కాంత మహంతి, మహిమ ముండ, శుభాషిస్ పండ, ఆకాశ బిబార్, ప్రభాషిణీ లామాల్, దమయంతి సాహు, సయిత గౌలారి తదితరులు పాల్గొన్నారు.

8కిలోల గంజాయి పట్టివేత



బలిమెల పోలీసులు అరెస్టు చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసులు బుధవారం రాత్రి బలిమెల–చిత్రకొండ రహదారిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు బైక్‌లతో ముగ్గురు వ్యక్తులు గంజాయితో పట్టుబడ్డారు. వీరిని అరెస్టు చేసి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా చిత్రకొండలో కొన్న గంజాయిని కలిమెల సమితి ఎంవీ 79 గ్రామానికి తరలిస్తామని తెలిపారు. తూకం వేయగా 8 కిలోలు ఉంది.

నకిలీ విదేశీ మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాటిళ్లు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పుట్ సమితి కుడుములగుమ్మా పంచాయతీ సెంటర్‌లో ఉన్న విదేశీ మద్యం షాప్‌లో నకిలీ విదేశీ మద్యం పట్టుబడింది. నకిలీ మద్యంపై బలిమెల పోలీసులకు బుధవారం సమాచారం రావడంతో ఐఐసీ ధీరజ్ పట్నాయిక్ తన సిబ్బందితో కలిసి గురువారం దుకాణంపై దాడి చేశారు. కుడుములగుమ్మ పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి కృష్ణచంద్ర హియాల్ కూడా తనిఖీలు చేయగా షాప్ మేనేజర్ మరో ఉద్యోగి పారిపోయారు. షాప్‌లో ఉన్న మరో ఇద్దరు ఉద్యోగులను అరెస్టు చేసి మద్యం బాటిళ్లపై ఉన్న నకిలీ బ్రాండ్‌లను గుర్తించారు. కొంత సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని అభిలేష్ కుమార్ యాదవ్, లాలన్ కుమార్ యాదవ్‌లుగా గుర్తించారు.

ద్వేషం వద్దు.. ఐక్యత ముద్దు

- రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభం పాటి



విభజన నిర్వాసిత కుటుంబాలకు సత్కారం

భువనేశ్వర్: పౌరులు ద్వేషాన్ని తిరస్కరించి ఐక్యతను బలోపేతం చేయాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి పిలుపు నిచ్చారు. రాజ్ భవన్‌లోని నూతన అభిషేక్ హాల్‌లో గురువారం జరిగిన విభజన భయానక జ్ఞాపకాల దినం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ సతీమణి జయశ్రీ కంభంపాటి హాజరయ్యారు. భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర ఉన్నత విద్య, క్రీడలు, యువజన సేవలు, ఒడియా భాష, సాహిత్యం, సాంస్కృతిక విభాగం మంత్రి సూర్య వంశీ సూరజ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విభజన గాయాలు చెరగని మచ్చలు మిగిల్చాయని, విద్వేష రాజకీయాలు విభజన పరిస్థితుల్ని పునరావృతం చేయరాదని, సహనం, సానుభూతి, న్యాయం ద్వారా ఐక్యతను పెంపొందించుకోవాలని గవర్నర్ హితవు కోరారు. విభజన మానవాళి చరిత్రలో అత్యంత విషాదకరమైన సంఘటనలలో ఒకటిగా గవర్నర్ అభివర్ణించారు. విభజన ప్రభావంతో ఉపఖండం యొక్క సాంస్కృతిక, మతపరమైన బంధాలు విచ్ఛిన్నమై లక్షలాది మంది నిరాశ్రయులయ్యారని, మరెందరో ప్రాణాలను కోల్పోయారని గుర్తు చేశారు. ఏటా ఆగస్టు 14న విభజన భయానక జ్ఞాపకాల దినం ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందనీయులని గవర్నర్ కొనియాడారు. భావి తరాలు విషాద విభజన తీవ్రతను అర్థం చేసుకుని బలమైన సమైక్య భారత్ సంరక్షకులుగా ఎదిగేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. విభజన సమయంలో సుదూరంగా ఉన్న ఒడిశా స్థానభ్రంశం చెందిన వారి పట్ల కారుణ్య ప్రతిస్పందన హర్షణీయమని అన్నారు ఈ మానవతా స్ఫూర్తి మన రాష్ట్ర నైతికతలో పెన వేసుకుపోయిందన్నారు. ఈ విలువల ఆదర్శం ప్రామాణికంగా యువత ఈ నేలపై మరోమారు విభజన చీకట్లు కమ్ముకుండా విభజన నాశనం ధ్యేయంగా ఐక్యత భావాలతో సంకల్పబద్ధంగా శక్తివంతమైన భారత దేశ పౌరులుగా ఎదగాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రసంగిస్తూ ఈ దినం దేశ స్వేచ్ఛతో ముడిపడిన విషాదకర విభజనను గుర్తు చేస్తుంది. మనం స్వాతంత్ర్యం పొందినప్పుడు, లక్షలాది కుటుంబాలు భయానకమైన స్థానభ్రంశంతో ప్రియమైన వారిని కోల్పోయిన దుఃఖాన్ని ఎదుర్కొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన పూర్వీకులు విభజన గాయాలను భరించి ఆ విధ్వంసం నుండి ఐక్యత కలలు కన్నారు. ఆగస్టు 14 నాటి భయానక సంఘటనలను గుర్తు చేసుకోకుండా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అసంపూర్ణంగా మిగిలిపోతాయని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. చరిత్ర నుండి నేర్చుకోకుండా, మనం ముందుకు సాగలేమన్నారు. విభజన సమయంలో ప్రజలు అనుభవించిన బాధకు చరిత్రలో సముచిత గుర్తింపు లభించలేదని రాష్ట్ర ఉన్నత విద్యా మంత్రి సూర్య వంశీ సూరజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్య సభ సభ్యుడు నిరంజన్ బిషి, ఏకామ్ర భువనేశ్వర్ నియోజక వర్గం ఎమ్మెల్యే బాబూ సింగ్, గవర్నర్ కార్యదర్శి, కమిషనర్ రూపా రోషన్ సాహు మరియు నిర్వాసిత పౌరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాసిత కుటుంబాలను సత్కరించారు.



విభజన భయానక జ్ఞాపకాల దినం కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగం



విభజన భయానక జ్ఞాపకాల దినం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభావిత వర్గీయులు

త్రివర్ణ పతాకాల రెపరెపలు



ర్యాలీలో వాయిద్యాలతో పాల్గొన్న సరస్వతీ శిశు మందిర విద్యార్థులు

జయపురం: జయపురం పట్టణం గురువారం త్రివర్ణ పతాకాల రెపరెపలతో మెరిసిపోయింది. పట్టణంలో పలు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు మూడురంగుల జెండాలతో పట్టణంలో ప్రతి మార్గంలోనూ ర్యాలీలు నిర్వహించారు. ఉదయం 7 గంటల సమయంలో జయపురం మున్సిపాలిటీ అతి పెద్ద ర్యాలీ నిర్వహించింది. మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి అయిన సబ్ కలెక్టర్ కుమారి అక్కవరం శౌశ్యారెడ్డి, అదనపు కార్యనిర్వాహక అధికారి పూజ రౌత్, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్మన్ బి.సుజాత, బ్లాక్ విద్యాధికారి చందన నాయిక్, జయపురం సబ్‌డివిజన్ సమాచార పౌర సంబంధాల అధికారి యశోద గదబ బాబు భాయ్ భజరంగ్, జయపురం సిటిజన్ కమిటీ అధ్యక్షురాలు బినోదినీ సాంతపాత్ర, కార్యదర్శి జి.వెంకట రెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు. విక్రమ్‌దేవ్ విశ్వ విద్యాలయ విద్యార్థులు కూడా ర్యాలీ చేశారు.



జాతీయ పతాకాలతో ర్యాలీలో పాల్గొన్న సబ్ కలెక్టర్, తదితరులు



ర్యాలీలో జాతీయ పతాకాలతో జన సమూహం



అతి పెద్ద త్రివర్ణ పతాకంతో ర్యాలీ



అతి పెద్ద త్రివర్ణ పతాకాన్ని తీసుకుని వెళ్తున్న యూనివర్సిటీ విద్యార్థులు



ర్యాలీలో పొడవైన త్రివర్ణ పతాకం

కటక్ నగరానికి తీపి కబురు

- త్వరలో విమానాశ్రయం: ఎంపీ భర్తృహరి మహతాబ్

భువనేశ్వర్: కటక్ నగర ప్రజలకు తీపి కబురు. నగరానికి త్వరలో విమానాశ్రయం రావచ్చని స్థానిక లోక్‌సభ సభ్యుడు డాక్టర్ భర్తృహరి మహతాబ్ విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. కటక్ నగర శివార్లు చౌద్వార్‌లోని చరబటియా వైమానిక స్థావరం రక్షణ శాఖ అధీనంలో ఉంది. దీన్ని అభివృద్ధి చేయాలని ఆయన ప్రతిపాదించారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఈ వైమానిక స్థావరం కీలక పాత్ర పోషించి చారిత్రాత్మక ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. దీర్ఘకాలంగా ఇది మరుగున పడింది. ఈ వైమానిక స్థావరాన్ని అభివృద్ధి చేసి కార్గో, పౌర విమానాలకు ఉపయోగించవచ్చు. ఈ విషయంలో ముఖ్యమంత్రితో మాట్లాడి లిఖితపూర్వకంగా అభ్యర్థించినట్లు వివరించారు. ఈ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఆసక్తి చూపారని ఎంపీ తెలిపారు. మరో వైపు రక్షణ మంత్రిని కలిసి ఈ విషయంలో ఒక మెమోరాండం సమర్పించినట్లు పేర్కొన్నారు. భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల తాకిడి క్రమంగా పుంజుకుంటు రద్దీగా మారుతుంది. కటక్‌లో విమానాశ్రయం ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడ రద్దీ తగ్గుతుందన్నారు.

ఓఎంఎం చౌరస్తాలో ఫ్లైఓవర్

కటక్ ప్రాంతంలో వాహనాల రవాణా రద్దీ నిర్వహణకు సహాయపడటానికి ఓఎంఎం చౌరస్తా దగ్గర ఫ్లైఓవర్ నిర్మాణం అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు వ్యయ ప్రణాళిక రూ. 640 కోట్లు. బడ్జెట్‌లో దీని కోసం నిధులు మంజూరు చేసినట్లు ఎంపీ భర్తృహరి మహతాబ్ తెలిపారు. ప్రతిపాదిత ఫ్లైఓవర్ పారాదీప్‌కు ప్రయాణించే వారికి ఉపకరిస్తుంది. ఈ మార్గంలో బస్సులు, ట్రక్కులు భారీ రవాణాతో ట్రాఫిక్ జామ్‌తో కిటకిటలాడుతుంటుంది. ఫ్లైఓవర్ నిర్మాణంతో ఈ సమస్య కొంత మేరకు నివారించబడుతుందన్నారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్ ఆమోదించబడింది. త్వరలో దీని కోసం టెండర్ జారీ చేసి తదుపరి కార్యాచరణ కొనసాగుతుందన్నారు. వీలైనంత త్వరగా నిర్మాణం పనులు ప్రారంభించబడతాయన్నారు.

సీపీఐ నాయకుల ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

జయపురం: మన దేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలను నిరసిస్తూ జయపూర్ పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద సీపీఐ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ.. అమెరికా ప్రభుత్వానికి బాకా ఊదుతున్న మోదీ ప్రభుత్వం ఇప్పటికైనా మారాలని సూచించారు. అమెరికా నిర్ణయాల వలన పాలస్తీనా, గజాలో లక్షలాది మంది శిశువులు, ప్రజలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్ – పాకిస్తాన్ యుద్ధం తానే ఆపానని నేటికీ ట్రంప్ చెబుతున్నాడని, అయినా పీఎం నరేంద్రమోదీ పెదవి విప్పడం లేదని నిందించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలని సూచించారు. ఆందోళనలో కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి రామకృష్ణ దాస్, మాజీ కార్యదర్శి జుధిష్ఠగర్ రౌలో, యువనేత సత్యబ్రత నంద, నంద హరిజన్, పదమణ మాలి తదితరులు పాల్గొన్నారు.

కటక్‌లో హర్ ఘర్ తిరంగా ఊరేగింపు

భువనేశ్వర్: కటక్ బొయాలీస్ మౌజా ప్రాంతంలో గురువారం నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' ఊరేగింపులో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పాల్గొన్నారు. బొయాలీస్ మౌజా ప్రాంతంలో జింకిరియా వద్ద ప్రారంభమైన త్రివర్ణ పతాక ర్యాలీ చందులి వరకు దాదాపు 10 కిలోమీటర్ల పొడవునా కొనసాగింది. ఈ ఊరేగింపులో ముఖ్యమంత్రితో పాటు పలువురు ప్రజలు పాలుపంచుకున్నారు. జాతీయ జెండాను చేతిలో పట్టుకుని బైక్‌లపై వందలాది మంది భారత్ మాతా కీ జై నినాదంతో ముఖ్యమంత్రితో కలిసి ఊరేగింపులో ఆద్యంతం పాల్గొన్నారు. అక్కడక్కడా మహిళలు ముఖ్యమంత్రిని పూలు, మంగళ హారతితో స్వాగతించారు. కటక్ ఎమ్మెల్యే ప్రకాష్ సెఠి, స్థానిక ప్రతినిధులు, వేలాది మంది ప్రజలు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా ఊరేగింపులో ముఖ్యమంత్రి

బాలుడి అదృశ్యం.. గ్రామస్తుల ఆందోళన



బొయిపరిగుడ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన జరుపుతున్న బాలుని బంధువులు, గ్రామస్తులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి రామగిరి పోలీసు స్టేషన్ తెండకాపదర్ గ్రామంలో 14 ఏళ్ల బాలుడు భగవాన్ శాంత జూలై 19 ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. గడ్డి కోసి వస్తానని వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. తాము అన్ని చోట్లా గాలించినా భగవాన్ జాడ తెలియక రామగిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వెల్లడించారు. అయితే భగవాన్ ఒక మిత్రునితో కలసి జయపురం వెళ్లినట్లు తెలిసిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆ మేరకు కనుక్కొంటే అతడు రాయగడలో ఉన్నట్లు తెలిసిందని తెలిపారు. కానీ రామగిరి పోలీసుల దర్యాప్తుతో నిరాశకు గురయ్యామని బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో ఆందోళన జరిపి ఫిర్యాదు చేశారు. కనిపించకుండా పోయిన భగవాన్‌ను వెతికేందుకు ఒక ప్రత్యేక టీమ్‌ను రాయగడ పంపుతామని బొయిపరిగుడ పోలీసు అధికారి రశ్మీ రంజన్ ప్రధాన్ వారికి హామీ ఇచ్చారు.

గ్రానైట్ కంపెనీ మేనేజర్ కిడ్నాపర్ల అరెస్టు



గ్రానైట్ మేనేజరు ధర్మేంద్ర కిడ్నాప్‌కు పాల్పడిన నిందితులు

పర్లాకిమిడి: గుసాని సమితి దుమ్మునిగ్రామం (దవిడిగాం) వద్ద శ్రీహరి గ్రానైట్స్ మేనేజర్ ధర్మేంద్ర కుమార్ తన కార్యాలయంలో బుధవారం పనిచేస్తుండగా తన ప్రత్యర్థి గోపాల్ సింగ్ రెండు కార్లతో ఏడుగురు గూండాలతో వచ్చి కత్తులతో బెదిరించి ధర్మేంద్ర కుమార్‌ను కిడ్నాప్ చేశారు. పది లక్షలు ఇస్తే విడిచిపెడతామని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే అక్కడే ఉన్న దమ్మునిగాం జై శ్రీగ్రానైట్స్ మేనేజరు తారాసింగ్ యాదవ్ (రాజస్థాన్) స్థానిక ఆదర్శ పోలీసు స్టేషన్‌లో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి విజయనగరంలో ఉన్న గోపాల్ సింగ్ (గ్రానైట్స్ కంపెనీ యజమాని) నుంచి కిడ్నాప్‌కు గురైన ధర్మేంద్రను విడిపించారు. కిడ్నాప్‌కు గురైన ధర్మేంద్ర కుమార్ గోపాల్ సింగ్‌కు వ్యాపార లావాదేవీల్లో డబ్బు బాకీ ఉన్నట్టు ఎస్పీ జ్యోతింద్ర పండా విలేకరుల సమావేశంలో తెలిపారు. పలుసార్లు ధర్మేంద్ర కుమార్‌కు ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో కిడ్నాప్ చేయడానికి ప్లాన్ వేసినట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు. కిడ్నాపర్స్ ఏడుగుర్ని ఒడిశా పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.25వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు కార్లు (మహీంద్ర, మారుతీ డిజైర్) ను పోలీసులు స్వాధీనం చేసుకుని పర్లాకిమిడికి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన ఏడుగురు కిడ్నాపర్లను ఆదర్శ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో హాజరుపరిచారు. అనంతరం జిల్లా కోర్టుకు నిందితులను తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ జ్యోతీంద్ర పండా విలేకరులతో అన్నారు. విలేకరుల సమావేశంలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, ఐఐసీ ప్రశాంత్ భూపతి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా, ఐఐసీ ప్రశాంత్ భూపతి



కిడ్నాప్‌కు ఉపయోగించిన కార్లు



నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న డబ్బు, మొబైల్స్

క్లుప్తంగా

ఓట్ చోర్‌పై ఆందోళన



పర్లాకిమిడి రాజవీధిలో కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

పర్లాకిమిడి: ఓట్ చోర్ వివాదంపై పర్లాకిమిడి కాంగ్రెస్ కార్యాలయం నుంచి పట్టణంలోని పలు కూడళ్లలో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఓట్ల దొంగలు గద్దె దిగాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అభిమన్యుపండా, ఈశ్వర చంద్ర మఝి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జాస్మిన్ షేక్, రంజితా పాణిగ్రాహి, సంజయ్ అధికారి, త్రినాథ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ గురువారం అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు మరీ దారుణంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఏజెంట్లు లేకుండా ఎన్నికలు జరగడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. పక్క మండలాలకు చెందిన టీడీపీ గూండాలను తీసుకొచ్చి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఇంతటి దారుణమైన ఘటనలు జరిగినా ఎన్నికలు కమిషన్, పోలీసు యంత్రాంగం ఏమీ తెలియనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు గుర్తించి అక్రమాలకు ఒడిగట్టారన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల వినూత్న నిరసన




టీ తాగుతూ ప్రభుత్వ ఉద్యోగుల నిరసన

హిరమండలం: టీడీపీ కూటమి ప్రభుత్వ తీరుపై ఉద్యోగులు గురువారం వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు గాంధేయవాదం ప్రదర్శించారు. హిరమండలంలోని వంశధార ప్రాజెక్టు కట్టడాల విభాగం వద్ద 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల నుంచి భారీగా ఉద్యోగులు తరలివచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు, న్యాయబద్ధ చెల్లింపులు, ప్రభుత్వ హామీలపై చర్చించారు. ప్రభుత్వం స్పందించే వరకూ ఐక్య పోరాటాలు చేద్దామని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం హిరమండలం తాలుకా యూనిట్ అధ్యక్షుడు మీసాల వరప్రసాదరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగ్గిలి కళ్యాణ్, జాయింట్ సెక్రటరీ పైడి రవికుమార్, పిసిని రమేష్, టింగ మనోజ్, పైల వెంకట రమణ, రామకృష్ణ, నడిమింటి షన్ముఖరావు, వసంతరావు,రేగేటి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పొలంలోనే ప్రాణం విడిచి..

రణస్థలం: లావేరుకు చెందిన ఎచ్చెర్ల గొల్ల (50) అనే రైతులు గుండెపోటుకు గురై పొలంలోనే మృత్యువాతపడ్డాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. లావేరు చెందిన గొల్ల అనే రైతు తాను కౌలుకు తీసుకున్న పొలానికి నీరు కడదామని గురువారం మధ్యాహ్నం వెళ్లాడు. వ్యవసాయ బోరు రిపేర్ కావడంతో మెకానిక్ ను పిలిపించి బాగు చేయించాడు. మధ్యాహ్నం 3గంటల సమయంలో వరి పొలానికి నీరు కడుతుండగా గుండెపోటు వచ్చి వరిచేనులో పడిపోయాడు. విగత జీవిగా పడి ఉన్న రైతును స్థానికులు గుర్తించి లావేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్పటి వరకు అందరితో కలిసి మెలిసి ఉండే గొల్ల అకస్మాత్తుగా చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈయన వ్యవసాయ పను లు లేనప్పుడు రణస్థలం జాతీయ రహదారిపై బస్టాప్ వద్ద చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య భాగ్యలక్ష్మి కుమార్తె స్వరూప, కుమారుడు రామకృష్ణ ఉన్నారు.

సెప్టెంబర్ 13న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్ : కక్షిదారులు వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఉత్తమ వేదికగా నిలుస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. సెప్టెంబర్ 13న జరగబోయే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని, ఎక్కువ కేసులు రాజీ చేయడానికి బీమా సంస్థలు, న్యాయవాదులు చొరవ తీసుకోవాలని సూచించారు. మంగళవారం జిల్లా కోర్టు భవనంలో బీమా సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. వివాదాలు త్వరగా పరిష్కరించడానికి అదాలత్ మేలు చేస్తుందన్నారు. సమావేశంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ జి.సువర్ణ రాజు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పర్లాకిమిడి: కలెక్టరేట్ నుండి బైక్ ర్యాలీలో ఉపాధ్యాయులు, ప్రభుత్వ సిబ్బంది.



పర్లాకిమిడి: ఘర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ మధుమిత

పర్లాకిమిడి: గజపతి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం ఉదయం కలెక్టర్ కార్యాలయం నుంచి జాతీయ పతాకాలతో మోటారు సైకిళ్ల ర్యాలీని జిల్లా కలెక్టర్ మధుమిత జెండా ఊపి ప్రారంభించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని జిల్లా అంతటా ఏడు రోజులు తిరంగా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి గజపతి స్టేడియం, హైస్కూల్ జంక్షన్, మార్కెట్, కొత్త బస్టాండ్, ప్యాలస్ వీధి మీదుగా ప్రభుత్వ ఆస్పత్రి మీదుగా కొనసాగింది. ఈ ర్యాలీలో అధికారులతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ఏడీఎం ఫల్గుణీ మఝి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శంకర కెరకెటా, డీఎఫ్ఓ కె.నాగరాజు, సబ్ కలెక్టర్ అనుప్ పండా, ఐటీడీఏ పీఓ అంశుమాన్ మహాపాత్రో, జిల్లా పరిషత్ అదనపు పీడీ పృథ్వీరాజ్ మండల్, పురపాలక ఈఓ లక్ష్మణ ముర్ము తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: భారతీయ జనతా పార్టీ స్థానిక ఇరదల వీధి పార్టీ కార్యాలయం నుంచి రాజవీధి మీదుగా స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని తిరంగ శోభాయాత్ర ర్యాలీని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నబకిశోర్ శోబోరో, మాజీ అధ్యక్షుడు ముల్లి గోపాలరావు, సిద్దేశ్వర మిశ్రా, కాశీనగర్ నాయకులు ఛిత్రి సింహాద్రి, యువజన నాయకులు కోట్ల యువరాజ్, కౌన్సిలరు బబునా బెహారా పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: జిల్లా కేంద్రంలో స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా అధికారుల ఆధ్వర్యంలో గురువారం వివిధ పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. స్థానిక రిలయన్స్ పెట్రోల్ బంక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల్లో చేపట్టారు. జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి, జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహోరో, జిల్లా క్రీడాశాఖ అధికారి షేక్ అలీనూర్, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి సుస్మీతా బౌరి, తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: ప్యాలస్ వద్ద తిరంగా బైక్ ర్యాలీ.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుంచి సాంస్కృతిక భవనం వరకు 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కామి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారీ టాంగులు, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ చంద్ర సోభరో , జిల్లా సబ్ కలెక్టర్ అశ్విని, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: ఘర్ ఘర్ తిరంగా ర్యాలీలో అధికారులు



పర్లాకిమిడి: మహారాజా పార్క్ వద్ద తిరంగా ర్యాలీలో బీజేపీ శ్రేణులు



పర్లాకిమిడి: తిరంగా ర్యాలీలో బీజేపీ శ్రేణులు



మల్కన్‌గిరి: ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ



మల్కన్‌గిరి: హర్ ఘర్ తిరంగా ర్యాలీ

భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టుకు త్వరలో కొత్త ప్రతిపాదన

భువనేశ్వర్: ఉవ్విళ్లూరిస్తున్న భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు పనులు రద్దు అయ్యాయి. గత ప్రభుత్వం సంకల్పించి చేపట్టిన పనుల్ని కొత్త ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. ఈ ప్రాజెక్టు విషయమై కేంద్ర సహకారం కోరుతూ కొత్త ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి మంత్రి కృష్ణ చంద్ర మహాపాత్రో గురువారం తెలిపారు. భువనేశ్వర్ మెట్రో ప్రాజెక్టుపై మంత్రివర్గ స్థాయి ఉపసంఘం రెండో సమావేశంలో కొత్త సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి కృష్ణ చంద్ర మహాపాత్రో తెలియజేశారు. ఈ కమిటీ వివిధ నగరాలను సందర్శించి స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసిన మేరకు నగరంలో నెలకొని ఉన్న ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మెట్రో రైలు మార్గం, పార్కింగ్ జోన్లు, ఇతర సౌకర్యాల వివరాలపై వివరణాత్మక నివేదికను సిద్ధం చేస్తుంది. ప్రాజెక్ట్ వివరాలను ఖరారు చేసే ముందు ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటారని మంత్రి తెలిపారు. లోగడ ప్రతిపాదిత మార్గంలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ కారణంగా మునుపటి మెట్రో ప్రణాళికను రద్దు చేశారు. పరీక్ష దశలో కూడా, ఈ పరిస్థితి ప్రజలకు గణనీయమైన అసౌకర్యాన్ని కలిగించిందని అధికారులు గుర్తించారు. ఇలాంటి సమస్యలను నివారించడానికి కొత్త సాంకేతిక కమిటీ ప్రాజెక్ట్‌ను సజావుగా అమలు చేయడానికి సమగ్ర మొబిలిటీ ప్లాన్‌తో ప్రత్యామ్నాయ మార్గాలను సిఫార్సు చేస్తుంది. మెట్రో రైళ్ల నిర్వహిస్తున్న వివిధ నగరాలను ఒక బృందం సందర్శించి పరిస్థితుల్ని సమీక్షిస్తుంది. మెట్రో ప్లాన్‌ను అమలు చేయడానికి కేంద్రం సహాయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

ఒడిశా నుంచి ఇద్దరు పోలీసు అధికారులకు రాష్ట్రపతి పతకం

భువనేశ్వర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒడిశాకు చెందిన ఇద్దరు సీనియర్ పోలీసు అధికారులు ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి విశిష్ట సేవ పతకానికి ఎంపికయ్యారు. కేంద్ర హోం శాఖ విడుదల చేసిన జాబితా ప్రకారం, ఒడిశా పోలీసులకు చెందిన 9 మంది సిబ్బంది విధి నిర్వహణలో అసాధారణమైన ధైర్యసాహసాలకు గాను శౌర్య పతకాన్ని కూడా అందుకుంటారు. మరో 11 మంది అధికారులకు వారి విశిష్ట అంకితభావం, దీర్ఘకాలిక సేవకు గుర్తింపుగా ప్రశంసాపత్రం పొందుతారు. దేశ వ్యాప్తంగా 1,090 మంది పోలీసులు ఈ పతకాలకు ఎంపికయ్యారు. కమాండెంట్ నరేష్ కుమార్ పటేల్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ రబీంద్ర కుమార్ పండాలకు రాష్ట్రపతి పతకం లభిస్తుంది. శౌర్య పతకానికి అర్హత సాధించిన వారిలో ఒక్కో సబ్ ఇనస్పెక్టర్, కానిస్టేబుల్, హవల్దార్, ఇద్దరు ఓపీఎఫ్ సిబ్బంది, నలుగురు కమాండోలు ఉన్నారు. ఓపీఎఫ్ వర్గంలో అమరేష్ నరేంద్ర, కానిస్టేబుల్ జితేంద్ర నాయక్, కమాండో వర్గంలో డంబురుధర్ భోయ్, నవీన్ సాహు, ప్రదీప్ శ్రేస్తా, అభిమన్యు మాఝీ ఉండగా మిగిలిన వారిలో అర్జున్ మల్లిక్, యుధిష్ఠిర్ మల్లిక్, హవల్దార్ అశ్విని బాగ్ శౌర్య పతకాన్ని అందుకోనున్నారు. ఒడిశా నుంచి 11 మంది ప్రశంసనీయ సేవా పతకాన్ని అందుకుంటారు. వారిలో సహాయ ఇన్‌స్పెక్టరు మహేశ్వర్ సెఠి, అదనపు పోలీసు సూపరింటెండెంట్లు ప్రదీప్ కుమార్ ప్రధాన్, దేబేంద్ర నారాయణ దాస్, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్లు అశిష్ కమార్ రౌత్, హేమమాలిని నాయక్, ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్ దొర, సంతోష్ కుమార్ మీర్ధా, కమాండెంట్ సూర్య నారాయణ్ మల్లిక్, సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లు అరుణ్ కమార్ సామంత్, అరవింద్ దాస్, కానిస్టేబుల్ చిన్మయి రౌత్ ప్రశంసనీయ సేవా పతకాన్ని అందుకుంటారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

శ్రీకాకుళం న్యూకాలనీ: అధికార యంత్రాంగమంతా సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పిలుపునిచ్చారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో 1వ, 2వ, 4వ, 7వ స్థాయీ సంఘాల సమావేశాల్లో పలు శాఖల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచు కుని అధికారులు పనిచేయాలన్నారు. సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున ముందస్తుగా సమాయత్తం కావాలన్నారు. కవిటి, సోంపేట ప్రాంతాల్లో కిడ్నీ రోగులకు డయాలసిస్ సౌకర్యాలు పెంచడం, అవసరమైన బెడ్లను కల్పించడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని ఎంపీడీవోల కు సూచించారు. డీడబ్ల్యూఎంఏ ద్వారా పూర్తయిన పనుల బిల్లులు తక్షణం చెల్లించాలని, పంచాయతీ రాజ్‌శాఖ కాలం చెల్లిన పనుల జాబితాను సమర్పించాలని ఆదేశించారు. ఉద్దానం పైప్‌లైన్ లీకేజీలను సరిచేయాలన్నారు. లోవోల్టేజి సమస్యలను పరిష్కరించాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం జరిగిన 3వ, 5వ, 6వ స్థాయీ సంఘాల సమావేశాల్లో కూడా పలు అభివృద్ధి పనుల ప్రగతిని సమీక్షిస్తూ, ప్రజా అవసరాల తీర్చడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

పట్టపగలే తల పగలగొట్టి..

- పట్టుపురంలో మహిళపై దాడి
- బురఖా ధరించి చోరీకి ప్రయత్నించిన మరో మహిళ



తీవ్రంగా గాయపడిన కంచాన

మెళియాపుట్టి : పట్టపగలే ఓ మహిళ చోరీకి ప్రయత్నించడ మే కాకుండా.. మరో మహిళపై దాడి చేసి పారిపోయిన ఘటన మెళియాపుట్టి మండ లం పట్టుపురంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. పట్టుపురం గ్రామానికి చెందిన అంబల కాంచన ఎప్పటిలాగే గురువారం మెళియాపుట్టిలో ఉన్న సాయిబాబా ఆలయంలో సేవకు వెళ్లింది. కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చింది. ఆ సమయంలో తలుపులు తెరిచి ఉండటంతో లోపలికి వచ్చి చూసేసరికే తలుపు చాటున బురఖా ధరించి ఉన్న గుర్తు తెలియని మహిళ ఇనుపరాడ్డుతో మహిళపై దాడికి పాల్పడింది. బాధితురాలు కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. గ్రామస్తులు వచ్చేసరికే గుర్తు తెలియని మహిళ ఒడిశా స్కూటీపై గారబంద వైపు వెళ్లిపోయింది. గ్రామస్తులు వెంబడించి నా ఆమె ఆచూకీ లభించలేదు. విషయం తెలుసుకున్న పాతపట్నం సీఐ వి.రామారావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా, బాధితురాలి భర్త ఆర్టీసీలో డ్రైవర్ గా విధుల్లో ఉండగా.. ఇద్దరు కుమారులు ఉపాధి నిమి త్తం వలస వెళ్లారు. నగదు, విలువైన వస్తువులు ఏవైనా చోరీకి గురయ్యాయా?లేదా? అనేకోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న పాతపట్నం సీఐ రామారావు

హత్య కేసులో నిందితులకు రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : తన వద్ద పని చేసిన దినసరి కూలీని దాడిచేసి అతని మృతికి కారణమైన పండ్ల యజమానికి, సహకరించిన రామకృష్ణకు జిల్లా కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ గురువారం వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని పాట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ వద్ద ఈ నెల 3న పండ్లషాపు యజమాని చీకటి వంశీకృష్ణ, అతని మిత్రుడు ఎం.రామకృష్ణలు లెక్కల్లో తేడా చూపించాడంటూ ఉల్లాకుల రాజేష్‌ను మద్యం మత్తులో దాడికి పాల్పడ్డారు. అదేరోజు అర్ధరాత్రి నిర్లక్ష్యంగా రాజేష్‌ను వారి ఇంటి ముందే పడేయడం.. భార్య, కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించడం.. మంగళవారం చికిత్స పొందుతూ రాజేష్ మృతిచెందిన తెలిసిందే. మొదట 81/25 బీఎన్ఎస్ సెక్షన్‌గా కేసు నమోదు చేశామని తర్వాత హత్యాకేసుగా పరిగణనలోకి తీసుకుని బుధవారం నిందితులిద్దరినీ అరెస్టు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

బ్యాంకు దోపిడీకి విఫలయత్నం



యూనియన్ బ్యాంకు వద్ద వివరాలు సేకరిస్తున్న సీఐ పైడపునాయుడు, ఎస్ఐ గంగరాజు

- గోడకు రంధ్రం పెడుతుండగా గమనించిన స్థానికుడు
- పారిపోయిన దుండగులు
- శ్రీకూర్మంలో ఘటన

గార : శ్రీకూర్మం యూనియన్ బ్యాంకులో దోపిడి చేసేందుకు దొంగలు విఫలయత్నం చేశారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో బ్యాంకు గోడకు రంధ్రం పెట్టి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. పశ్చిమ వైపునున్న మేనేజర్ గది కిటికీపై సన్‌స్లేడ్ సమీపంలో మూడు ఇంచీల మేర రంధ్రం చేయడంతో పాటు పక్కనే ఉన్న ఇంటర్‌గ్రిల్ తొలగించేందుకు ప్రయత్నం చేశారు. ఆ సమయంలో బ్యాంకుపైన నివసిస్తున్న ఓ వ్యక్తి కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. కన్నం పెట్టేందుకు ఉపయోగించిన, సుత్తి, కత్తవ, సన్నిగొడ్డ (రాయి)ని అక్కడే వదిలేశారు. వెంటనే స్థానికులు బ్యాంకు సిబ్బందికి తెలియజేశారు. గురువారం ఉదయం బ్యాంకు మేనేజర్ చినరామయ్య గార పోలీసులకు సమాచా రం అందించారు. ఒకటో పట్టణ స్టేషన్ సీఐ పైడపునాయుడు, ఎస్ఐ గంగరాజు, సీసీటీఎస్ సిబ్బంది బ్యాంకు పరిసరాలను పరిశీలించారు. శ్రీకూర్మం గ్రామంలో రాత్రి 11 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడం, ఆ సమయంలో దొంగతనానికి పాల్పడటం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. శ్రీకూర్మం మెయిన్ రోడ్డులో ఉన్న ఈ బ్యాంకుపై ఆరు కుటుంబాలు నివసిస్తుండగా, ఎదురుగా కొన్ని కుటుంబాలున్నాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



బ్యాంకు గోడకు పెట్టిన రంధ్రం

భోజనంలో నిద్రమాత్రలు కలిపి..

- ప్రియుడి సాయంతో భర్తను హత్య చేసిన భార్య
- వ్యక్తి అనుమానాస్పద మృతి కేసులో ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

పాతపట్నం : పాతపట్నం మేజర్ పంచాయతీ మొండిగల వీధికి చెందిన నల్లి రాజు (34) మృతి కేసును పోలీసులు ఛేదించారు. ప్రియుడు, మరొకరి సాయంతో భార్యే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు విచారణలో గుర్తించి ముగ్గురినీ అరెస్టు చేశారు. ఈ మేరకు గురువారం పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. పాతపట్నం మొండిగలవీధికి చెందిన నల్లి రాజుకు మౌనికతో ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. మౌనికకు పాతపట్నం మాదిగవీధికి చెందిన గుండు ఉదయ్ కుమార్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం భర్తకు తెలియడంతో గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో రాజును హత్య చేయాలని మౌనిక.. తన భార్యకు విడాకులు ఇవ్వాలని ఉదయ్‌కుమార్ నిర్ణయించుకున్నారు. తర్వాత ఎక్కడికైనా పారిపోయి వివాహం చేసుకోవాలని భావించారు.

పక్కా పథకం ప్రకారం..

మౌనిక, ఉదయ్‌కుమార్ కలిసి రాజు హత్యకు పథకం వేశారు. కొత్త ఫోన్ నంబరుతో అమ్మాయిలా చాటింగ్ చేసి ఉదయ్‌కుమార్‌ను ఎక్కడికైనా రప్పించి చంపాలని నిర్ణయించుకున్నా సాధ్యం కాలేదు. దీంతో నిద్రమాత్రలు ఇచ్చి చంపాలని కుట్ర పన్నారు. ఇందుకు ఉదయ్‌కుమార్ తన బావ మాదిగవీధికి చెందిన చౌదరి మల్లికార్జున్ అలియాస్ మల్లికార్జునరావు సహాయం కోరాడు. కుట్రలో భాగంగా ఉదయ్‌కుమార్ పర్లాకిమిడిలో ఆర్ఎంపీ వైద్యుడి వద్ద పది నిద్రమాత్రలు కొని మౌనికకు ఇచ్చాడు. మౌనిక ఈ నెల 5న రాత్రి భోజనంలో నాలుగు నిద్రమాత్రలు కలిపి పెట్టింది. నిద్రలోకి వెళ్లడం గమనించి చంపవచ్చని నిర్ధారణకు వచ్చారు. ఈ నెల 6న రాత్రి భోజనంలో ఆరు మాత్రలను కలపడంతో రాజు గాఢ నిద్రలోకి వెళ్లిపోయాడు. మౌనిక వెంటనే ప్రియుడు ఉదయ్‌కుమార్, చౌదరి మల్లికార్జునరావులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. రాత్రి 11.30 సమయంలో ఇద్దరూ వీధి లైట్లు ఆపేసి మౌనిక ఇంటికి వెళ్లారు. రాజు కాళ్లు, చేతులను భార్య మౌనిక, మల్లికార్జునరావు పట్టుకోగా.. ఛాతిపై ఉదయ్‌కుమార్ కూర్చుని తలగడతో ఊపిరి ఆడకుండా చంపేశారు. అనంతరం రాజు మృతదేహంతో పాటు బైక్, చెప్పులు, మద్యం బ్యాటిల్‌ను హరిజనవీధికి దిగువన పడేసి వెళ్లిపోయారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మౌనిక తన భర్త ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. మరుసటి రోజు ఉదయాన్నే మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మౌనిక ఏడుస్తున్న ట్లు నటిస్తూ భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురినీ నిందితులుగా గుర్తించారు. దీంతో మౌనిక, ఉదయ్‌కుమార్, మల్లికార్జునరావులు రెవెన్యూ అధికారుల వద్ద లొంగిపోయారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసిన సీఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య, పీసీలు బి.జీవరత్నం, డి.గౌరీశంకర్‌రావు, పరమేష్‌లను అభినందించి, రివార్డులను డీఎస్పీ అందజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు. వెనుక నిందితులతో పోలీసులు

క్లుప్తంగా

పంద్రాగస్టు కవాతు సాధన



కవాతు సాధనను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: స్వాతంత్య్ర దినోత్సవ నిర్వహణలో భాగంగా స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు సాధన గురువారం జరిగింది. ఎస్పీ వకుల్ జిందల్ వారి పరేడ్ పరిశీలనకు వెళ్లగా, వారు ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఆగస్టు 15వ తేదీన జరిగే స్వాతంత్య్ర వేడుకల్లో మరింత ఉత్సాహంగా కవాతు చేసి, చూపరులను ఆకట్టుకునేలా ప్రదర్శన ఉండాలని ఆ దిశగా సాధన చేయాలని తెలిపారు. వేడుక చూసిన వారిలో దేశభక్తి, జాతీయ భావం పెంపొందేలా కార్యక్రమం ఉండాలన్నారు. వేడుకల్లో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు దివ్యవాణి



ఇటీవల బాపట్ల జరిగిన పోటీల్లో పాల్గొన్న దివ్యవాణి

మెంటాడ: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మెంటాడ మండలం, గుర్లతమ్మిరాజుపేట విద్యార్థిని అల్లు దివ్యవాణి ఎంపికైంది. ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు బాపట్ల జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 20 విభాగంలో జరిగిన 100 మీటర్లు, 200 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ మేరకు దివ్యవాణికి ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు, చొక్కాపు సన్యాసినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు తదితరులు అభినందనలు తెలిపారు.


త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డుపై పడిపోయిన వృద్ధురాలికి సపర్యలు చేస్తున్న స్థానికుడు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ ఐటీ సమీపంలో గురువారం త్రుటిలో ఓ ప్రమాదం తప్పింది. రేగిడి మండలం, సరసనాపల్లికి చెందిన వృద్ధ దంపతులు ద్విచక్ర వాహనంపై రాజాం నుంచి స్వగ్రామం వెళుతున్నారు. రోడ్డుపై పెద్దగోతులు ఉండడంతో ఒక్కసారిగా అదుపుతప్పి పడిపోయారు. అదే సమయంలో రాజాం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవరు ఈ ఘటనను చూసి షడన్ బ్రేక్ వేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు అప్రమత్తమై పడిపోయిన వృద్ధ దంపతులను పక్కకు తీసుకువెళ్లి సపర్యలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్అండ్‌బీ అధికారులు అప్రమత్తమై రోడ్డుపై గుంతలు పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు.

సారాబట్టీలపై పోలీసుల దాడులు



డ్రమ్ములను కాల్చివేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చెముడుగూడ పంచాయతీ, మంగన్నగూడ పరిసరాల్లో నిర్వహిస్తున్న సారాబట్టీలపై పోలీసులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సారా తయారీకి సిద్ధం చేసి ఉంచిన 1400 లీటర్ల బెల్లంఊటను గుర్తించి, దానిని బయటకు పారబోశారు. అనంతరం సారా తయారీకి వినియోగిస్తున్న డ్రమ్ములను స్వాధీనం చేసుకుని వాటిని కాల్చివేశారు. ఎక్కడైనా సారా తయారు చేసినా తరలించినా సమాచారం ఇవ్వాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడి గ్రామానికి చెందిన ఓ వివాహిత మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం రూరల్ ఎస్ఐ బి.సంతోషికుమారి గురువారం తెలిపారు. బుధవారం ఉదయం నుంచి ఆమె ఆచూకీ తెలియకపోవడంతో ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు.

కార్మికుల జీవితాల్లో కారు చీకట్లు

- కలగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు
- ఎన్నికల ప్రచారంలో బోర్డును పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ
- బోర్డు ఏర్పాటుకు రూ.కోటి ఇస్తానని తాడేపల్లి సభలో పవన్ ప్రకటన
- అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఆ దిశగా చర్యలు శూన్యం
- ప్రభుత్వ తీరుపై కార్మికుల మండిపాటు



భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు(ఫైల్)

వీరఘట్టం: కార్మికుల జీవితాల్లో కారుచీకట్లు అలుముకున్నాయి. వారికి ఇచ్చిన ఏ హామీ అమలుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో వారంతా అయోమయంలో పడిపోయారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. ఎన్నికల సమయంలో హామీలివ్వడం..గెలిచాక ఏదో సాకుతో దానిని అమలు చేయకుండా కాలయాపన చేయడం చంద్రబాబుకు మొదటి నుంచి అలవాటుగా మారిపోయింది. 2014 ఎన్నికల్లో ఆరు వందలకు పైగా హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత ఆయనది. 2024 ఎన్నికల ప్రచారంలో కూడా ఎన్నో హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఏ ఒక్క హామీ అమలుపై కూడా మాట్లాడని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా కార్మికుల సంక్షేమం కోసం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు ఫైల్‌పై పెడతామని హామీ ఇచ్చారు. అలాగే పెండింగ్‌లోని 42 వేల క్లెయిమ్‌ల పరిష్కారం, ఉచిత ఇసుకతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, 1996 భవన నిర్మాణ కార్మిక చట్టం ప్రకారం అన్నీ అమలు చేస్తామని హామీల వర్షం కురిపించారు. కార్మికుల పిల్లల చదువుకు రూ.20 వేలు, ఇన్సూరెన్స్ సదుపాయం, గర్భిణుల డెలివరీ ఖర్చులు, ఇప్పటివరకు సహజ మరణానికి చెల్లిస్తున్న రూ.లక్షను రూ.5 లక్షలకు పెంచుతాం, ప్రమాద మరణం బీమాను రూ.6 నుంచి రూ.10 లక్షలకు పెంచుతామని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. ఇవన్నీ నమ్మి భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న తాపీమేస్త్రీలు, తాపి పనివారు, రాడ్‌బెండర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, పెయింటర్లు, మార్బుల్ వర్కర్స్, టైల్స్ వర్కర్స్, రోజువారీ కూలీలు ఇలా అందరూ ఓట్లు వేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 80 వేల మంది భవన నిర్మాణ రంగంపై ఆధారపడి పని చేస్తున్నారు. అయితే ప్రభుత్వం అధికారం చేపట్టి 14 నెలలు గడిచినా తమకు ఇచ్చిన హామీల అమలుపై కూటమి సర్కారు నోరు మెదపకపోవడం పట్ల కార్మికులు పెదవి విరుస్తున్నారు.

కార్మికుల ఆశలపై నీళ్లు..

ఎన్నికల ప్రచారం సమయంలో తాడేపల్లిలో జరిగిన సభలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు తనవంతు సాయంగా కోటి రూపాయలు ఇస్తానని పవన్‌కల్యాణ్ ప్రకటించారు. అధికారం చేపట్టి 14 నెలలు గడుసున్నా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదు. ఆయన ఇస్తానన్న కోటి రూపాయలు ఇంకా జమ కాలేదు. భవన నిర్మాణ కార్మికులకు చట్ట ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైందని కార్మికులు మండిపడుతున్నారు. ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారం, ఇన్సూరెన్స్, నష్ట పరిహారంపై ప్రకటన కోసం కార్మికులంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వారి ఆశలపై నీళ్లు చల్లింది. ఎన్నికల హామీల అమలుతో పాటు డిమాండ్ల సాధనకు కార్మికులు గతేడాది నవంబర్ 11న ధర్నాకు దిగి నిరసన కూడా తెలియజేయడం జరిగింది. అయినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేకపోవడం దురదృష్టకరమని, వారి హామీలు నమ్మి మోసపోయామని కార్మికలోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

సంక్షేమ బోర్డు ఊసే లేదు



కార్మిక శాఖ మంత్రిగా సుభాష్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొదటి సంతకం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు ఫైల్‌పై అన్నారు. 14 నెలలు గడిచిపోయాయి. సంక్షేమ బోర్డు ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు కార్మికులకు ఎన్నో హామీలిచ్చారు. బడ్జెట్‌లో వాటి ఊసే లేదు. ఉచిత ఇసుక పాలసీ ప్రకటించారు కానీ ఎక్కడా ఉచిత ఇసుక దొరకడం లేదు. సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలపై ప్రభుత్వం నియంత్రణ కొరవడింది. ఫలితంగా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో నిర్మాణ రంగం మందగించింది. కార్మిక శాఖ మంత్రి సుభాష్‌ను, మంత్రి లోకేష్‌ను ఇప్పటికి నాలుగు సార్లు కలిసినా ప్రయోజనం లేదు.

– కె.గౌరీశ్వరరావు, భవన నిర్మాణ కార్మికుల సంఘం, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు

స్వయం ప్రతిపత్తి కల్పించాలి..



ఎన్నికల మేనిఫెస్టోలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, చంద్రన్న బీమా పథకం తీసుకొచ్చి సహజ మరణానికి రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఒక్కో భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి రూ.25 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పిస్తామని చంద్రబాబు ప్రకటించారు. స్వయం ప్రతిపత్తి, విధాన పరమైన నిర్ణయాలతో పనిచేసే సంక్షేమ బోర్డు పథకాలను ప్రభుత్వ పథకాలతో లింక్ పెట్టకుండా అమలు చేయాలి. ప్రభుత్వ పథకాలు వేరు. కార్మిక సంక్షేమ బోర్డు వేరు. రెండింటికీ ముడి పెట్టకూడదు. సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను కార్మిక కుటుంబాల సంక్షేమానికి వినియోగించాలి.

–పిన్నింటి శ్రీనివాసరావు, భవన నిర్మాణ సంఘం సభ్యుడు, వీరఘట్టం

మాట నిలబెట్టుకోవాలి..



ఎన్నికల ముందు పాలకొండ పర్యటనకు వచ్చిన పవన్ కల్యాణ్ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని మాట ఇచ్చారు. ఆయన తన మాటను నిలబెట్టుకోవాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికుల సంక్షేమం ఆయనా పట్టించుకోవడం లేదు. కార్మికులకు ఉపాధి భద్రత, ఆర్థిక భరోసా కల్పించాలి. 50 ఏళ్లు దాటిన కార్మికులకు పింఛను ఇస్తామన్నారు. 62 ఏళ్లు దాటినా పింఛన్ ఇవ్వడం లేదు.

–దావాల రమణారావు, సీఐటీయూ, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు

19 నుంచి 27వ తేదీ వరకు పలు రైళ్ల రద్దు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి, డొంకినవలస రైల్వే స్టేషన్ల పరిధిలో మూడో రైల్వేలైన్ పనుల్లో భాగంగా ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు కొన్ని రైళ్లను పూర్తిగా రద్దు చేయగా, మరికొన్ని రైళ్లను విజయనగరం వరకు కొనసాగిస్తున్నట్టు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం నుంచి రాయపూర్ ప్యాసింజర్ (58258), విశాఖపట్నం నుంచి కోరాపుట్ డీఎంయూ (58538), విశాఖపట్నం నుంచి భవానీ పట్నం ప్యాసింజర్ (58504) ఈ నెల 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు పూర్తిస్థాయిలో రద్దు చేసినట్లు తెలిపారు. భవానీ పట్నం నుంచి విశాఖపట్నం పాసింజర్ (658503), రాయపూర్- విశాఖపట్నం ప్యాసింజర్(58257), కోరాపుట్-విశాఖపట్నం డీఎంయూ (58537) ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు పూర్తిస్థాయిలో రద్దు చేసినట్లు పేర్కొన్నారు. గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (17243) ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు విజయనగరం వరకు, రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్(17244) ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు విజయనగరం నుంచి బయలుదేరుతుందని తెలిపారు. దుర్గ్ నుంచి విశాఖపట్నం వెళ్లే వందే భారత్(20829) ఈ నెల 21వ తేదీ నుండి 27వ తేదీ వరకు మూడు గంటల ఆలస్యంగా బయలుదేరుతుందని పేర్కొన్నారు. నాందేడ్ -సంబల్‌పూర్ వెళ్లే నాగావళి ఎక్స్‌ప్రెస్ (20810) ఈనెల 24వ తేదీ, 26వ తేదీల్లో నాలుగు గంటలు ఆలస్యంగా బయలుదేరుతుందన్నారు. విశాఖపట్నం నుంచి దుర్గ్ వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (20830) ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు రెండు గంటల 30 నిమిషాల ఆలస్యంగా బయలుదేరుతుందని పేర్కొన్నారు. అలాగే, విశాఖపట్నం-నిజాముద్దీన్ వెళ్లే సమతా ఎక్స్‌ప్రెస్ (12807) ఈ నెల 20, 21, 23, 24, 26 తేదీల్లో ఐదు గంటలు ఆలస్యంగా బయలుదేరుతుందన్నారు.

వివాహేతర సంబంధమే కారణం..



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమణ, వెనక పట్టుబడిన నిందితులు

బొండపల్లి: మండలంలోని కెరటం గ్రామంలో ఈ నెల 9వ తేదీన అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి మృతికి గల కారణం ఆయన భార్యకు వేరే వ్యక్తితో ఉన్న వివాహేతర సంబంధమేనని గజపతినగరం సీఐ జీఏవీ రమణ తెలిపారు. ఇదే కేసు వివరాలను బొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం సాయంత్రం వెల్లడించారు. మృతుడు నీడిగేటి కృష్ణను నారపాటి సాయి ఈ నెల 9న మద్యం తాగుదామని పిలిచి గ్రామం బయటకు తీసుకుని వెళ్లి అక్కడ అతడి పీక నులిమి హత్య చేసినట్లు పేర్కొన్నారు. ఈ హత్య ఘటనలో ప్రధాన నిందితుడు సాయి కాగా మృతుడి భార్య రాజు రెండవ నిందితురాలని, మృతుని కొడుకు మైనర్ కూడా హత్యలో పాల్గొన్నట్లు తెలిసిందన్నారు. ప్రధాన నిందితుడు సాయిని బిళ్లలవలస వద్ద గురువారం సాయంత్రం పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి



ఆందోళన వ్యక్తం చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవారలో జిందాల్ నిర్వాసితులు నిర్వహిస్తున్న శాంతియుత నిరసన గురువారం నాటికి 53వ రోజుకు చేరుకుంది. మా భూములు మాకు ఇప్పించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కోరుతూ బ్యానర్ ప్రదర్శించారు. పల్నాడు జిల్లాలో సరస్వతి పవర్ కంపెనీకి ఇచ్చిన భూముల వద్ద మీరు(పవన్ కల్యాణ్) వెళ్లి, విచారణ జరిపి అక్రమాలు జరిగాయని నిర్ధారించి భూముల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి రైతులకు న్యాయం చేశారని గుర్తు చేశారు. అదే తరహాలో తమకు కూడా న్యాయం చేయాలని తమ భూములు తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. తమ ప్రాంతంలో కూడా ఓసారి పర్యటించి, తమ బాధలు వినాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు, పాలకులు తమను పట్టించుకోవడం లేదని మీరే న్యాయం చేయగలరని నమ్ముతున్నామని, మీరే రావాలని మా సమస్యలు ఆలకించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రేషన్ అవస్థలు



దిగువ మెండంగి నుంచి రేషన్ బియ్యం నెత్తిన పెట్టుకుని కాలినడకన వస్తున్న కోమటివలస గిరిజనులు



మూడు కిలోమీటర్ల దూరంలోని రేషన్ దుకాణం నుంచి బియ్యం పట్టుకుని బిడ్డతో కలిసి వస్తున్న మర్రి సీతమ్మ

రేషన్ బియ్యం పంపిణీలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం..గిరిజనుల పాలిట శాపంగా మారింది. అధికారంలోకి రాగానే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేసి, మళ్లీ పాత విధానంలోనే రేషన్ షాపుల వద్దనే రేషన్ సరుకుల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో గిరిజనులకు కష్టాలు మొదలయ్యాయి. కొన్ని కిలోమీటర్ల మేర కొండలు, వాగులు, వంకలు దాటుకుని కాలినడకన రేషన్ షాపు వద్దకు చేరుకుని, అక్కడ కొన్ని గంటల పాటు వేచి ఉండగా వచ్చిన రేషన్‌ను మళ్లీ నెత్తిన పెట్టుకుని కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయని, జగనన్న హయాంలోనే బాగుండేదని ఎండీయూ వ్యాన్ ద్వారా గ్రామంలోకి రేషన్ వచ్చేదని అంటున్నారు. అదే విధానాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–సాలూరు రూరల్

సాగునీటి సరఫరాలో జాప్యం

- డీఆర్‌సీలో ప్రశ్నించిన జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



డీఆర్‌సీ సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, మంత్రులు, అధికారులు

విజయనగరం అర్బన్: ప్రణాళికలు లేని పాలనవల్లే ఖరీఫ్ సాగుకు సకాలంలో సాగునీటిని అందజేయలేకపోయారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆరోపించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం (డీఆర్‌సీ) గురువారం నిర్వహించారు. తొలుత ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలోని తోటపల్లి ప్రాజెక్టుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల ఎందుకు ఆలస్యమైందని ప్రశ్నించారు. గత ఐదేళ్ల పాలనలో జూన్ నెలలోనే సాగునీటిని విడుదల చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రాజెక్టులో నీరున్నా ఎందుకు విడుదల చేయలేదో చెప్పాలని అధికారులను నిలదీశారు. కాలవల పూడిక తీత పనులు చేపట్టామని అధికారులు చెప్పగా ముందుగా ప్రణాళిక వేసుకోలేదా అని ప్రశ్నించారు. ఇన్‌చార్జి మంత్రి అనిత కలుగుచేసుకొని మూడు జిల్లాలకు సంబంధించిన కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నీటి సంఘాలతో మాట్లాడుకోవాల్సి ఉంటుందని సమాధానం ఇచ్చారు. రైతులకు నీరివ్వడంలో ఈ ఏడాది 15 రోజులు ఆలస్యమైందని అంగీకరించారు.

✍ డీసీసీబీ చైర్మన్ నాగార్జున మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఎత్తిపోతల పథకం నుంచి రాజాం, చీపురుపల్లి ప్రాంతాలకు సాగునీరు అందడం లేదని ఆరోపించారు. బాడంగి మండలం వాడాడ గ్రామం పరిధిలోని 860 హెక్టార్ల సాగుభూమి కోసం గత ప్రభుత్వ హయాంలో ఈ ఎత్తిపోతల పథకం వినియోగంలోకి వచ్చిందని తెలిపారు. దీనిపై పూర్తినివేదిక ఇవ్వాలని హోంమంత్రి అధికారులను ఆదేశించారు.

✍ వ్యవసాయ శాఖ సమీక్షలో 5 వేల మెట్రిక్ టన్నుల ఎరువుల కొరత ఉన్నట్లు కలెక్టర్ బహిరంగంగానే చెప్పడం, గతంలోనే డిమాండ్ చేసినప్పటికీ ఇంకా పూర్తి సరఫరా జరగలేదని జెడ్పీ చైర్మన్ విమర్శించారు. నానో యూరియా వినియోగంపై ప్రచారం చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా రైతుల్లో సందేహాలు తొలగడంలేదన్నారు.

✍ పరిశ్రమల సమీక్షలో జిల్లాలో మూతపడిన పరిశ్రమల జాబితాలు ఇవ్వాలని మంత్రి అనిత చెప్పడం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి స్తబ్దతను తెలియజేసింది. మహిళలకు ఉచిత ప్రయాణం కోసం స్త్రీ శక్తి బస్సులు ప్రారంభిస్తున్నట్లు మంత్రి చెప్పినా జిల్లాలో 160 బస్సులకు కేవలం 137 బస్సులు మాత్రమే సిద్ధం కావడం, వాటిలో సీసీటీవీ అమలు వంటి పనులు ఇంకా పూర్తికాలేదని తెలియజేశారు. సమావేశంలో వైద్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖలపై సమీక్షించారు. ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, డాక్టర గాదె శ్రీనివాసులనాయుడు, ఎంపీ అప్పలనాయుడు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, సీపీఓ పీ.బాలాజీ, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, ఆర్‌డీఏ దాట్ల కీర్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఒక్కరు మినహా ఎమ్మెల్యేలందరూ డుమ్మా

ప్రజల సమస్యలను జిల్లా స్థాయిలో పాలకులను చెప్పుకొనే అవకాశం ఉన్న వేదిక డీఆర్‌సీ. ప్రతి మూడునెలకు ఒకసారి జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరై జిల్లా అభివృద్ధికి సంబంధించిన సూచనలు, సమస్యల పరిష్కారాలు చేపడతారు. జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మినహా మిగిలిన వారంతా గైర్హాజరుకావడం గమనార్హం.

కళ తప్పిన కొప్పెర్ల గురుకులం

- శిథిలావస్థలో భవనాలు
- ప్రారంభానికి నోచుకోని డార్మిటరీ
- గురుకులంలో చేరేందుకు విద్యార్థులు అనాసక్తి
- మొత్తంగా 200 సీట్లు ఖాళీ



కొప్పెర్ల గురుకులం ముఖద్వారం



పెచ్చులూడిన శ్లాబ్

పూసపాటిరేగ: కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులం... రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు ఉన్న విద్యాలయం. 1983 జాతీయ రహదారిని ఆనుకొని సుమారు 20 ఎకరాలు విశాలమైన స్థలంలో ఏర్పాటైంది. ఇక్కడ సీటు సాధించేందుకు పోటీ పడాల్సి వచ్చేది. ఈ విద్యాలయంలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఇంజినీర్లుగా, డాక్టర్లుగా, ఎస్ఐలుగా, రాజకీయనాయకులుగా రాణిస్తున్నారు. ప్రస్తుతం గురుకులం కళతప్పింది. ఇక్కడ భవనాలు శిథిలావస్థకు చేరినా పట్టించుకునేవారే కరువయ్యారు. సరైన వసతిలేక పోవడంతో తరగతి గదుల్లో విద్యార్థులు విద్యాభ్యాసంతోపాటు నివాసం ఉంటున్నారు. తరగతి గదులు, డార్మిటరీ అధ్వానంగా తయారయ్యాయి. చాలా తరగతి గదులకు డోర్లు లేవు. గురుకులం ప్రిన్సిపాల్ చొరవతో ఉపాధ్యాయులు చందాలు వేసుకుని ఇటీవల డోర్లను ఏర్పాటుచేశారు.

సీట్లు ఖాళీ..

కొప్పెర్ల గురుకులంలో సీటు సాధిస్తే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని భావించేవారు. నేడు అదే విద్యాలయంలో 200 సీట్లు ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గురుకులంలో 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 620 సీట్లు ఉన్నాయి. రాష్ట్రస్థాయి అధికారుల అనుమతితో మరో 50 సీట్లలో ప్రవేశాలు కల్పించవచ్చు. అయితే, ప్రస్తుతం 420 మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. సుమారు 200 సీట్లు ఖాళీగానే ఉన్నాయి. ఎన్నిసార్లు నోటిఫికేషన్ ఇచ్చినా గురుకులంలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తిచూపడంలేదు. ఎస్ఎంఎస్ పరిశ్రమ సహకారంతో కొన్ని తరగతి గదులు నిర్మించారు. మైలాన్ పరిశ్రమ సహకారంతో డార్మిటరీ నిర్మాణ పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. కూటమి ప్రభుత్వం శిథిల భవనాల మరమ్మత్తులకు ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గురుకులంలోని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



కొప్పెర్ల గురుకులంలో శిథిల భవనాల మరమ్మతుల విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. గురుకులంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధిస్తున్నాం. శిథిల భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు కావాల్సి ఉంది.

– అప్పారావు, ప్రిన్సిపాల్, కొప్పెర్ల గురుకులం


డోలీలతో నిరసన



గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ శృంగవరపుకోట మండలంలోని దారపర్తి గెడ్డ వద్ద గిరిజనులు గురువారం వినూత్న నిరసన చేపట్టారు. డోలీలు చూపిస్తూ ఇక్కడి గెడ్డను దాటాలంటే నీటి ప్రవాహంలో గెడ్డను దాటలేని చిన్నారులు, వృద్ధులను ఇలా డోలీలో మోసుకుని వెళ్లాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. దారపర్తి, మారిక డి.కెపర్తి, మూలబొడ్డవార పంచాయతీల్లోని గిరిశిఖర గ్రామాలకు నేటికీ రోడ్డు సదుపాయం లేదని, గెడ్డలపై వంతెనలు కూడా లేవని దీంతో తామంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పాలకులు మారుతున్నా తమ బాధలు మాత్రం తీరడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్లు, వంతెనలు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–శృంగవరపుకోట

సబ్ కలెక్టర్ సుడిగాలి పర్యటన



సవర దిమ్మిడిజోలలో విద్యార్థులు చదువుతున్న పాఠాలు వింటున్న సబ్‌కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్

భామిని: పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ భామిని మండలంలో గురువారం సుడిగాలి పర్యటన చేశారు. తహసీల్దార్ శివన్నారాయణ, ఎంపీడీఓ వసంతకుమారితో కలిసి సవర దిమ్మిడిజోల ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. దగ్గరుండి పాఠాలు చదివించారు. ఆర్ఓ వాటర్ ప్లాంట్ లేకపోవడాన్ని గుర్తించారు. అనంతరం లోవగూడలో పీఎం జన్‌మన్ గృహాలను పరిశీలించి అందుతున్న బిల్లులపై ఆరా తీశారు. భామిని జీసీసీ డిపోను సందర్శించగా డిపోకు తాళాలు వేసి ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు.

బత్తిలిలో డిపోను సందర్శించి సరుకుల పంపిణీ, స్టాక్‌లు సక్రమంగా ఉండడాన్ని గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం భామిని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి రీ సర్వేపై సూచనలు చేశారు. డీటీ శంకర నాయుడు, ఆర్ఐ మణి ప్రభాకర్, సర్వేయర్ రాజేశ్వరరావు ఉన్నారు.